క్లుప్తంగా

పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కాసు

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మంగళవారం పర్యటించారు. 18వ వార్డులో అనారోగ్యం తో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నేత ఈదా సాంబిరెడ్డిని పరామర్శించారు. అనంతరం దాచేపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత పిడతల మోషే కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాసు వెంట నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ సర్పంచులు మందపాటి రమేష్ రెడ్డి, బుర్రా విజయ్ కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మూలగుండ్ల ప్రకాష్ రెడ్డి, కౌన్సిలర్లు ఈదా వెంకటరెడ్డి, మందపాటి వీరారెడ్డి, చాట్ల క్రాంతికుమార్, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభాని ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ మేరికనకం



రెంటచింతల: వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ దొప్పలపూడి మేరిక నకం అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తుఫాన్ కారణంగా రానున్న రెండు, మూడు రోజులు ఎడతెరపి లేకుండా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మట్టిమిద్దెలలో నివసించేవారు సురక్ష ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వర్షం కురుస్తూ ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో చెట్లకిందకు వెళ్లవద్దన్నారు. గ్రామాల పరిసరాలలో పొంగుతున్న వాగులు, కుంటల వద్దకు చిన్న పిల్లలను వెళ్లకుండా చూడాలని చెప్పారు. పొలాలలోని విద్యుత్ మోటార్లు ఆన్ చేసే సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లలోని కరెంట్ వైర్లు ఉన్న తడిచిన గోడలు, ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభాలను తొందరపాటులో ఎవరూ తాకవద్దని వాటికి ఎర్త్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గ్రామాలలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఆయా గ్రామాల వీఆర్వోలకు పలు సూచనలు చేయడం జరిగిందని తహసీల్దార్ వివరించారు.

గణేష్ విగ్రహాలకు అనుమతి తప్పనిసరి



విజయపురిసౌత్: ఈ నెల 27న జరిగే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ తెలిపారు. మంగళవారం ఎస్ఐ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ వినాయక విగ్రహాల మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు విద్యుత్, పంచాయతీ, అగ్నిమాపక శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వినాయక మండపాలు, నిమజ్జన ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని చెప్పారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



పిడుగురాళ్ల: పట్టణంలోని లక్ష్మీ స్టూడియోలో ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ... జీవితంలో ఉననటువంటి జ్ఞాపకాల మన కళ్ల ముందు నిలిపే ఫొటోగ్రాఫర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాలన్నారు. అదే విధంగా ఎంతో మంది తమ ప్రాణాలను లెక్కచేయకుండా కొన్ని ఫొటోలను చిత్రీకరిస్తుంటారని పేర్కొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి

చిలకలూరిపేట: విద్యుత్ వినియోగదారులకు సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులు, సిబ్బందిపై ఉందని విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక చైర్మన్, విశ్రాంతి జిల్లా న్యాయ మూర్తి ఎస్.విక్టర్ ఇమానియేలు చెప్పారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సింగు ఫంక్షన్ హాలులో విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చిన వెంటనే స్పందించి చర్యలు చేపడితే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. వినియోగదారుల సంతృప్తి ఎంతో ముఖ్యమని వెల్లడించారు. ఈ సదస్సులో చిలకలూ రిపేట పట్టణానికి సంబంధించి ఏడు సమస్యలు, చిలకలూరిపేట మండలానికి సంబంధించి రెండు సమస్యలు, గణపవరం సెక్షన్‌లో ఒక సమస్య, జోకిపత్రుకు సంబంధించి ఒక సమస్య, వట్టి చెరుకూరుకు సంబంధించి ఒక సమస్య ఫోరం దృష్టికి వచ్చాయి. మొత్తం 12 సమస్యలకు సంబంధించి మూడు సమస్యలు వెంటనే పరిష్కారం కాగా, మిగిలిన తొమ్మిది దరఖాస్తులను ఏడు రోజుల లోపు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



పత్తి రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ లక్ష్మారెడ్డి

రెంటచింతల: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల నుంచి ముదురు పత్తి వేసిన రైతులు పంటను కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గ్రామాలలో మిట్టగుడిపాడు, గోలి గ్రామాల లో ముదురు పత్తి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షం కురిసిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన మాట్లాడుతూ పొలంలో పల్లం ప్రాంతంలో వర్షంనీరు నిలిస్తే వెంటనే వెళ్లపెట్టాలన్నారు. ఎకరాకు 15 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను వెద పెట్టాలని లేద చల్లాలన్నారు. కాయకుళ్లు, కొమ్మ కుళ్లు, ఆకు మచ్చ వంటి తెగుళ్ల నివారణకు లీటర్‌కు నీటిలో కాపర్ ఆక్సైడ్ క్లోరైడ్ మందును 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. రైతులందరూ సాగుచేసిన, సాగు చేస్తున్న పంటలకు రైతు సేవాకేంద్రంలో పంట బీమా చేయించుకోవాలన్నారు. గూడ, పూల రాల కుండా 60 రోజులు నుంచి 90 రోజులు పత్తి పంటకు ఒకసారి 1.5 గ్రాముల బోరాక్స్‌పొడిని ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకుని నివారించ వచ్చని వివరించారు. వ్యవసాయ రుణం పొందిన రైతులు బ్యాంక్‌శాఖ ద్వారా బీమా ప్రీమియం చెల్లించుకోవచ్చన్నారు. వ్యవసాయ రుణం పొందని రైతులు దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్‌లో, మీ-సేవా, రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించి పంటల బీమా చేయించుకోవాలని ఎకరా వరికి రూ.80 ప్రీమియం చెల్లించాలని కోరారు. ఆగస్టు 31 వరకు వరికి మాత్రమే పంటల బీమా చేయించుకోవడానికి గడువుందన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను రైతులు తమ వద్ద కచ్చితంగా పంటల కాలం ముగిసే వరకు భద్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాంబాబు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్

రెంటచింతల: ప్రమాదకరమైన పరిస్థితులలో నిస్వార్థంగా మానవసేవలో ధన్యులైనవారిని స్మరించుకోవడం కోసమే ప్రపంచ మానత్వ దినోత్సవం జరుపుకుంటున్నట్లు స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ మానత్వ దినోత్సవం కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విపత్తులు, యుద్ధాలు, అంటువ్యాధులు వంటి సమయాలలో ప్రజలకోసం స్వార్థం లేకుండా పనిచేసిన వారిని 2009 నుంచి ఆగస్టు 19 వ తేదీన ప్రపంచ మానత్వ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. దయనీయ స్థితిలో కూరుకుపోయిన వారికి సహాయం చేసి ఆదుకోవాలన్నారు. రామకృష్ణ పరమహంస సూక్తి మానవ సేవే... మాధవసేవ.. మదర్‌థెరిసా చూపిన ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న సూక్తులను ఆదర్శంగా తీసుకుని మానవత్వమే దైవత్వంగా భావించి ఆపదలలో నున్న ఆదుకోవడానికి విద్యార్థి దశనుంచే అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు, విద్యావేత్త నారాయణపురం శ్రీనివాస్, వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్ కట్టేబోయిన సైదులు, ఎంఎల్ఆర్ ఫౌండేషన్ మేనేజర్ కళ్యాణ్ పాల్గొన్నారు.

యోగా పోటీల్లో తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

పిడుగురాళ్ల: గుంటూరులో నిర్వహించిన యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు డైరెక్టర్ బొల్లా గిరి బాబు మంగళవారం తెలిపారు. 10-12 సంవత్సరాల విభాగంలో ఎం. శ్రీనివాసరావు గోల్డ్‌మెడల్, ఎస్.ప్రశాంత్ సిల్వర్ మెడల్ గెలుపొందారన్నారు. అలాగే 12-14 సంవత్సరాల విభాగంలో కె.శ్రీ మణిదీప్, బ్రాంజ్ మెడల్, వి.సాల్మన్ 4 స్థానంలో నిలిచినట్లు చెప్పారు. 14-16 సంవత్సరాల విభాగంలో ఎల్.వెంకట కార్తిక్ గోల్డ్‌మెడల్ గెలుపొందారని, అలాగే ఆరుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు వివరించారు. సెప్టెంబర్‌లో పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించనున్న పోటీలకు హాజరవుతారని చెప్పారు. వీరిని ప్రిన్సిపాల్ నరేష్, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

పిడుగురాళ్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటన్సిఫైడ్ ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్(ఐఈసీ) క్యాంపెయిన్, హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పిడుగురాళ్ల ప్రాజెక్టు కౌన్సిలర్ నాగరాజు మాట్లాడుతూ... హెచ్ఐవీ, ఎయిడ్స్ అంటే ఏమిటి అని ఎన్ని మార్గాల ద్వారా వస్తుంది అని వివరించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లింక్ వర్కర్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ ఎం.విశ్వేశ్వరరావు, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నరసింహారావు, కళాశాల సిబ్బంది, ఐసీటీసీఎల్ టి. జయలక్ష్మి, టీబీహెచ్‌వీ అర్జున్‌రావు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



రాజమండ్రి వారిచే నిర్వహించిన బుర్రకథ



సత్యహరిశ్చంద్ర నాటకంలోని సన్నివేశం

రాజుపాలెం: మండల కేంద్రమైన రాజుపాలెంలో వేంచేసి ఉన్న పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం 5వ రోజు ప్రత్యేక పూజలతో ముగిశాయి. ఉదయం మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితులు నిత్యారాధన, మంగళాశాసనం నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. భక్తులు అధిక సఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఐదు రోజులపాటు స్వామి వార్లకు హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించిన వేద పండితులను దేవస్థాన వ్యవస్థాపకులు పాతూరి వెంకటరమసుబ్బారావు దంపతులు ఘనంగా సన్మానించారు. మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా రాజమండ్రి వారిచే నిర్వహించిన బుర్రకథ చూపరులను ఆకట్టుకుంది. సోమవారం రాత్రి సత్యహరిశ్చంద్ర పద్య నాటకంలోని కళాకారులు నటులను పలువురు అభినందించారు. మంగళవారం రాత్రి భక్త చింతామణి నాటకం చూపరులను ఆకట్టుకుంది.

ప్రముఖ పురుగు మందుల వ్యాపారి మృతి



సత్తెనపల్లి: ప్రముఖ ఎరువులు, పురుగు మందుల వ్యాపారి దూపగుంట్ల సుధాకర్ (48) మంగళవారం మృతి చెందాడు. పట్టణంలోని తన గృహం నుంచి ఉదయం బయటికి వస్తూ కాలుజారి పడిపోవడంతో వెంటనే మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఈ లోపే ప్రాణాలు పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. పట్టణంలోని గడియార స్తంభం మూల మీద తిరుమల ట్రేడర్స్ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తూ సుధాకర్ సత్తెనపల్లి చుట్టుపక్కల పలువురికి పరిచయస్తుడు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, ఎరువులు పురుగుమందుల వ్యాపారులు, రైతులు, మిత్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

జిల్లా ఖో ఖో జట్టుకు నకరికల్లు విద్యార్థులు



నకరికల్లు: జిల్లా స్థాయి ఖో ఖో జట్టులో తమ పాఠశాల విద్యార్థులు స్థానం సంపాదించినట్లు నకరికల్లు ఉన్నత పాఠశాల పీడీ జి.ఝాన్సీరాణి మంగళవారం తెలిపారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఈ నెల 29వ తేదీన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఖో ఖో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో బాలుర జట్టుకు షేక్ నబి రసూల్, బాలికల జట్టుకు డి.రంగమహాలక్ష్మి, పి.షాహినా, సీహెచ్ విజయ, బి.కావ్య ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఎంపికై న క్రీడాకారులు 20వ తేదీ నుంచి 22 వరకు నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ కాసా మల్లిఖార్జునరావు, పీడీ చింతా పుల్లయ్య తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

రోడ్డు ప్రమాదంలో గాయపడి



ప్రమాదం సంఘటన స్థలిలో విడిచిన ప్రమాదానికి కారణమైన స్కూటీ

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...చిలకలూరిపేట నుండి గుంటూరు వైపు సెంట్రింగ్ సామాన్ల లోడుతో వెళ్తున్న ఫోర్‌వీల్ ఆటో యడ్లపాడు ఎర్రకొండ సమీపంలో ఆగిపోయింది. దీంతో ఆటోలోని ముగ్గురు దిగి ముందుకు తోస్తున్న క్రమంలో అదేమార్గంలో వేగంగా దూసుకువచ్చిన స్కూటీ అదుపుతప్పి వారిలో ఒకరిని ఢీకొంది. దీంతో సదరు వ్యక్తి రోడ్డుపై పడి తలతోపాటు పలుచోట్ల కనిపించని గాయాలయ్యాయి. స్కూటీ నడిపే వ్యక్తి వాహనాన్ని వదిలి పరారయ్యాడు. తీవ్రంగా గాయలైన సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన విన్నకోట వెంకట మోహనరావు (52)ను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్సల అనంతరం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీపీఓపై చర్యలు తీసుకోవాలి

అమరావతి రజక ఐక్యవేదిక, ఎంహెచ్‌పీఎస్, బీఎస్‌పీ నాయకులు



మున్సిపల్ కార్యాలయంలో కూర్చొని నిరసన వ్యక్తంచేస్తున్న రజకులు, నాయకులు

నరసరావుపేట: రజకులపై అనుచిత వాఖ్యలు చేసిన మున్సిపల్ టీపీఓ సాంబయ్యపై చర్యలు తీసుకోవాలని అమరావతి రజక ఐక్యవేదిక, ఎంహెచ్‌పీఎస్, బీఎస్‌పీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి కమిషనర్ ఎం.జస్వంతరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌పీఎస్ నాయకుడు షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ కోటప్పకొండరోడ్డులో ఉన్న అన్నపూర్ణ రజక అన్నదాన సత్రం భూమిని కబ్జాకు గురైందని, కబ్జా చేసిన వ్యక్తుల నుంచి ఆ స్థలాన్ని కాపాడి సత్రంకు అందజేయాలని కోరుతూ రజకులు నాలుగు నెలల నుంచి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఈ మేరకు టీపీఓను కలిసి అడగ్గా వారిపై అనుచితంగా మాట్లాడుతూ మీరు ఆఫీస్ నుంచి వెళ్ళిపోవాలి అంటూ దుర్భాషాలాడుతూ ఘోరంగా మాట్లాడారన్నారు. బీఎస్‌పీ జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావు, అమరావతి రజక ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఉదయగిరి వెంకటస్వామి, సత్యం కోటేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

షాక్ కొడుతున్న బిల్లులు..

చిరు వ్యాపారుల అవస్థలు

- వ్యాపార విద్యుత్ చార్జీలతో పాటుగా అదనపు భారాలు
- ఇంటి బిల్లు, దుకాణాల బిల్లులుతో భారం అంటున్న చిరు వ్యాపారులు
- వ్యాపారాలు చేయలేక దుకాణాలు మూసేస్తున్న వైనం



టైలర్‌షాపు



కిరాణా వ్యాపారి విద్యుత్ బిల్లు



టైలర్ బాబు విద్యుత్ బిల్లు

క్రోసూరు: చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే టైలర్లు, కూల్‌డ్రింక్ షాపులు, మెడికల్ షాపులు, బార్బర్ షాపులు, కిరాణా, ఫ్యాన్సీ దుకాణాల నిర్వాహకులు విద్యుత్ చార్జీల అదనపు భారాలు మోయలేక వ్యాపారాలు చేయలేక అవస్థలు పడతున్నారు. మండలంలో క్రోసూరు టౌన్‌తో కలుపుకుని 21 గ్రామాలున్నాయి. వీటిలో సుమారు 200 మంది చిరు వ్యాపారులుంటారు. వీరిలో అనేక మంది చిన్న చిన్న దుకాణాలు నిర్వహించుకునే వారే అధికం. వీరికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అందవు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి టైలర్లకు చేదోడు పథకం కింద ఆర్థిక సహాయం, నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ అమలు చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అవేమి లేవు. దీంతో వారు ప్రస్తుతం షాక్ కొడుతున్న విద్యుత్ బిల్లులతో వ్యాపారాలు చేయలేక మూసివేస్తున్న పరిస్థితి నెలకొంది.

+ విద్యుత్ చార్జీలు కేటగిరి(2) పేరుతో వ్యాపారాలు నిర్వహించే వారికి గృహ విద్యుత్ కంటే అధికంగా చార్జీలు ఉంటాయి. అయితే కూటమి ప్రభుత్వం దుకాణాల విద్యుత్ చార్జీల స్లాబ్ ధరలతో పాటు ఇతర చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో సుమారు రూ.300-400 అదనంగా బిల్లులు వస్తున్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంటే 50 యూనిట్లు దాటితే యూనిట్‌కు రూ.7.65 చెల్లించాలి, అంటే కనీసం 50 యూనిట్లు వాడితే రూ.275 చెల్లించాలి. దీంతోపాటు అదనపు చార్జీలు రూ.200 కలిపి రూ.475 బిల్లు వస్తుంది. విద్యుత్ బిల్లులు, దుకాణం అద్దె, అవేకాక ఇంటి కరంట్ బిల్లు చెల్లించలేక చిరు వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు అదనపు, ఫిక్స్‌డ్, కస్టం చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, సర్దుబాటు చార్జీలు కలిపి సుమారు రూ.200-300 అదనంగా వస్తుంది. ప్రభుత్వం విద్యుత్ చార్జీలపై వేస్తున్న అదనపు భారాలు తగ్గించాలని కోరుతున్నారు.

కేటగిరి-2 విద్యుత్ చార్జీలు స్లాబ్ ధరలు ఇలా...

యూనిట్లు	ధర (యూనిట్‌కు రూపాయల్లో)
0-50	5.40
51-100	7.65
101-300	9.05
301-500	9.60
500 పైన	10.15

అవస్థలు పడుతున్నాను



గతంలో నాకు రూ.400 బిల్లు వచ్చేది. ఇప్పుడు రూ.600-700 వస్తుంది. దీంతో పాటు ఇంటి కరెంటు బిల్లు చెల్లించాలి. గతంలో జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టైలర్లకు ఆర్థిక సహాయం అందించారు. ఇప్పుడు అది కూడా లేదు. అవస్థలు పడుతున్నాను.

– షేక్ బాబు, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, క్రోసూరు

దుకాణం మూసేసాం



గతంలో బార్బర్ షాపు నిర్వహించాం. షాపు అద్దె, కరంటు బిల్లులు, ఇంటి నిర్వహణ ఖర్చులు పెరిగిపోయి దుకాణం మూసేసి వేరే షాపుల్లో పనికి వెళ్తున్నాను. గత ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చింది. ఇప్పుడు ఉచితం లేకపోవటంతో అధికంగా వచ్చే బిల్లులు చెల్లించలేకపోతున్నాం. ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు విద్యుత్ సబ్సిడీ ఇస్తే ఖర్చులు తగ్గుతాయి.

– పోతుగంటి నాగరాజు, సీపీఐ యువజన విభాగం నాయకుడు, క్రోసూరు

వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ



సత్తెనపల్లి: వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ జరిగిన ఘటన పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలోకి గుర్తు తెలియని దుండగులు కల్యాణ మండపం గుండా గోడ దూకి లోపలికి ప్రవేశించారు. ఆలయంలోని సీసీ ఫుటేజ్‌కు సంబంధించిన వైర్లు కట్ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కానుకల హుండీ పగలగొట్టి కానుకలను అపహరించుకుపోయారు. సుమారు రూ.15 వేలకు పైనే నగదు ఉండే అవకాశం ఉన్నట్లు అంచనా. దేవదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సరిమెళ్ళ కోటిరెడ్డి పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆలయాన్ని సందర్శించారు. క్లూ స్ టీం, వేలిముద్రల నిపుణులు ఆలయానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసు లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంచార జాతుల సదస్సును విజయవంతం చేయాలి

చిలకలూరిపేట: సంచారజాతుల సదస్సుకు సంబంధిత వర్గాల ప్రజలు భారీగా తరలిరావాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటీషర్ల పాలనలో అనేక రకాలుగా సమస్యలను సంచార జాతుల ప్రజలు అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళుతూ స్వతంత్ర్య పోరాట స్ఫూర్తి ప్రజలకు వివరించే వారని వెల్లడించారు. అలాంటి సంచార జాతుల పరిస్థితి నేటికి కూడా దైన్యంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 31వ తేదీన సంచార జాతుల దినోత్సవం ఉన్నందున సంబంధిత జాతుల్లో చైతన్యం నింపేందుకు బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 30 తేదీన విజయవాడలో స్ఫూర్తి అనే సంచార జాతుల సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఓబీసీ నాయకులు అన్నపరెడ్డి లక్ష్మణ్, కుప్పం కళ్యాణ దుర్గారావు, గుమ్మా బాలకృష్ణ, ఊటికొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.